పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించండి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు అధికారులకు సూచించారు. ఎస్‌పి కార్యాలయంలో శనివారం పోలీస్ అధికారులతో నిర్వహించిన క్రైమ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్, ఎస్‌హెచ్‌ఓ, ఎస్‌ఐల సంయుక్తంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిశోధనను పూర్తి చేసి సత్వరం పరిష్కరించేచర్యలు తీసుకోవాలన్నారు. చార్జిషీట్ ఫైల్ చేసిన కేసులలో సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా సంప్రదించి, అవకాశమున్న కేసులను ఇరుపక్షాలతో మాట్లాడి కోర్టు పెండెన్సీ కేసులను తగ్గించాలని సూచించారు. రహదారిప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పి పి.శ్రీనివాస్, ఎస్‌పి డిఎస్‌పి పి.మురళీకృష్ణారెడ్డి, పెద్దాపురం ఎస్‌డిపిఒ మురళి మోహన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పూర్తి ఆయకట్టుకు సాగునీరు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా పరిధిలో గోదావరి డెల్టా, ఏలేరు, పిబిసి, పంపా రిజర్వాయర్ల కింద పూర్తి ఆయకట్టుకు, సుబ్బారెడ్డి సాగర్ క్రింద 4 వేల ఎకరాల ఆయకట్టుకు రబీ సీజన్ పంటలకు సాగునీరు సరఫరా చేయనున్నామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తెలియజేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో కాకినాడ జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం జిల్లా కలెక్టర్ డా.కతికా శుక్లా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపి వంగా గీత ముఖ్య అతిథులుగాను, ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గౌరవ అతిథులుగాను పాల్గొన్నారు. కార్యక్రమంలో తొలుత మండలి కార్యదర్శి, ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.నరసింహమూర్తి, వివిధ సాగునీటి వ్యవస్థల క్రింద రబీ పంటలు, తాగునీరు అవసరాలు, ఆయా వ్యవస్థలలో అందుబాటులో ఉన్న నీటి లభ్యతలను సమీక్షకు వివరించారు. గోదావరి డెల్టా సిస్టమ్ క్రింద ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో నికర ఆయకట్టు 8,96,507 ఎకరాలకు గాను సాగు, త్రాగు నీటి అవసరాల కోసం 94.22 టియంసిల నీటి అవసరం ఉండగా, గోదావరి ఇన్ ఫ్లో 45.27 టియంసిలు, సీలేరు నుండి విడుదలయ్యే 40.235 టియంసిలు, పోలవరం ప్రాజెక్ట్ లోని నిల్వ 16 టియంసిలు వెరసి 101.505 టియంసిల నీటి లభ్యత ఉంటుందని తెలిపారు. అవసరాలకు పూర్తి స్థాయిలో నీటి లభ్యత ఉన్న దృష్ట్యా కాకినాడ జిల్లా పరిధిలో గోదావరి డెల్టా ఆయకట్టు 1,37,848 ఎకరాలకు, పిబిసి క్రింద 32,507 ఆయకట్టుకు రబీ 2022-23 పంటల సాగుకు నూరు శాతం ఆయకట్టుకు సాగు నీరు ఇచ్చేందుకు ఆయన ప్రతిపాదించగా, మండలి ఆమోదం తెలిపింది.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

ఏలేరు ఇరిగేషన్ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 53,017 ఎకరాల ఆయకట్టు 6.50 టియంసిల రబీ పంటల సాగుకు అవసరం కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్ లో 20.78 టియంసిల నీటి నిల్వ ఉందన్నారు. ఇందులో 6.16 టియంసిలు డెడ్ స్టోరేజ్, 3.5 టియంసిలు విశాఖ స్టీల్ ప్లాంట్ అవసరాలకు తీసివేయగా నికరంగా 11.12 టియంసిల నీరు ఏలేరు ఆయకట్టు అవసరాలకు అందుబాటులో ఉంటుందన్నారు. నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నందున ఏలేరు సాగునీటి వ్యవస్థ క్రింద మొత్తం నూరు శాతం ఆయకట్టుకు రబీ 2022-23 పంటలకు సాగునీటి సరఫరా చేసేందుకు సలహా మండలి ఆమోదించింది. పంపా రిజర్వాయరులో అందుబాటులో ఉన్న 0.284 టియంసిల నీరు, ఏలేరు నుండి సప్లిమెంట్ చేసే జలాలతో పంపా పూర్తి ఆయకట్టు 12,005 ఎకరాలకు రబీ సాగు నీరు అందించేందుకు మండలి ఆమోదించింది. సుబ్బారెడ్డి సాగర్ లో 0.125 టియంసిల నీరు మాత్రమే ఉన్నందున, మొత్తం ఆయకట్టు 9 వేల ఎకరాల్లో 4వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు రబీ సాగునీరు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో గోదావరి డెల్టా సిస్టమ్ ఆయకట్టుకు నవంబరు 30వ తేదీ నుండి, పిబిసి, ఏలేరు వ్యవస్థల క్రింద ఆయకట్టులకు డిసెంబరు 10వ తేదీ నుండి, పంపా, సుబ్బారెడ్డి సాగర్ ల ఆయకట్టులకు డిసెంబరు 25వ తేదీ నుండి రబీ సాగు నీటి విడుదలకు ప్రతి పాదించిన షెడ్యూల్ ను మండలి అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ డా.కతికా శుక్లా ఆమోదించారు.

ఎంపీ గీత మాట్లాడుతూ కాండ్రకోట వద్ద శాశ్వత బ్రిడ్జి నిర్మాణం చేపట్టే లోపు రైతులకు ఇబ్బంది లేకుండా సిఎస్ఆర్, యంపిలాడ్ నిధులతో తాత్కాలిక బ్రిడ్జి సత్వరం నిర్మించాలని అధికారులను కోరారు. ఆలాగే ఇటీవల భారీ వర్షాలు, వరదల వల్ల కోతకు గురైన ఏలేరు కాల్వలను సరిచేయాలని సూచించారు.

పిఠాపురం ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి ఏలేరు ఆధునీకరణకు ప్రకటించిన రూ.300 కోట్ల నిధులు మేరకు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సత్వరం ఆమోదానికి పంపాలని కోరారు. పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ వివిధ వ్యవస్థల క్రింద నూరు శాతం ఆయకట్టుకు నీరివ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. కోరంగి, సామర్లకోట డ్రైయిన్లలో తూడు తొలగించి శివారు భూములకు కూడా నీరు సక్రమంగా అందేలా చూడాలని ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు కోరారు. సమావేశంలో డిఆర్‌ఓ కె.శ్రీధరరెడ్డి, కాకినాడ ఆర్డిఒ బి.వి.రమణ, పెద్దాపురం ఆర్డిఒ జె.సీతారామారావు, ఇరిగేషన్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, ఆయకట్టుల వారీగా రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

నియామక ధ్రువపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

నలుగురికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ అనారోగ్య కారణంగా మరణించిన ఉద్యోగులకు సంబంధించి వారి కుటుంబీకులకు కారుణ్య నియామకంలో భాగంగా శనివారం కలెక్టర్ కృతికా శుక్లా ఉద్యోగ నియమక పత్రాలు అందజేశారు. వాలేరు వేణు తిరుపతిలో ఏపీఎస్పీ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణంగా మరణించగా ఆయన భార్య వాలేరు అజయ కుమారిని డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ఆఫీస్, రాజమహేంద్రవరంలో ఆఫీస్ సబార్డినేట్‌గాను, కుంచం అజాయి దొర కాకినాడ పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తుండగా అనారోగ్య కారణంగా మరణించగా ఆయన కుమారుడు కుంచం శ్రీనివాసరావును రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆఫీసులో ఆఫీస్ సబార్డినేట్‌గాను, చింతూరులో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న లేలి సోమయ్య అనారోగ్య కారణంగా మరణించడంతో ఆయన కుమారుడు లేలి సాయి దుర్గను రాజమహేంద్రవరం ప్రభుత్వ అబ్జర్వేషన్ హోమ్ లో సూపర్ వైజర్‌గాను, రంగంపేట మండలం చంద్రేడు గ్రామ సచివాలయంలో గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారిగా పని చేస్తున్న చింతపల్లి జ్యోతి ప్రకాష్ అనారోగ్య కారణంగా మరణించగా ఆయన కుమారుడు చింతపల్లి భాస్కరరావును జగ్గంపేట మండలం రామవరం గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ కృతికా శుక్లా ఉద్యోగ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఖాళీల సంఖ్య, రోస్టర్ అనుసరించి మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం అవకాశం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరావు ఉన్నారు.

శంగార వల్లభ స్వామి ఆలయానికి రూ.2,02,744 ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం తిరుపతి శంగార వల్లభ స్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో యాత్రికులు సందర్శించారని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. శనివారం ఒక రోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ. 1,59,160, అన్నదాన విరాళాల ద్వారా రూ.43,584 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం ప్రసాదం అందజేసి, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

- జగనన్న కాలనీలలో లబ్ధిదారుల సమస్యలపై
ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు ఆదేశాలు

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టర్ కార్యాలయంలో కాకినాడ పట్టణ నియోజకవర్గానికి సంబంధించి నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన గహ నిర్మాణాలు, లేఔట్ పనులు, టిడ్కో గృహాలు ఇతర అంశాలపై కలెక్టర్ కతికా శుక్లా కాకినాడ ఎంపీ వంగా గీత, కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్, హౌసింగ్, ఆర్డబ్ల్యుఎస్, ఎలక్ట్రిసిటీ తదితర శాఖల అధికారులతో కలిసి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీ గీత మాట్లాడుతూ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు పూర్తయిన వాటికి వెంటనే విద్యుత్, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కలెక్టర్ కతికా శుక్లా మాట్లాడుతూ గృహ నిర్మాణంలో మున్సిపల్, హౌసింగ్, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్ధిదారుడు గహ నిర్మాణం ప్రారంభించే విధంగా లబ్ధిదారు లకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ కాకినాడ అర్బన్ లబ్ధిదారుల కోసం సిద్ధం చేసిన కొమరగిరి జగనన్న కాలనీలో కాంట్రాక్టర్లతో గృహ నిర్మాణాలు చేపట్టారన్నారు. చొల్లంగి ఇతర ప్రాంతాలలో లేఅవుట్లలో స్టోన్ ప్లాంటేషన్, అంతర్గత రహదారులు, జియో టాకింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఎల్ఎ అధికారులకు సూచించారు. సమావేశంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, ఏడీసీ సీహెచ్ నాగనర సింహారావు, హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.శ్రీనివాసు, ఇతర విద్యుత్, హౌసింగ్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎంపీ గీత, కలెక్టర్ కత్తికా శుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి

పచ్చి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి (జగ్గంపేట)

రైతులు పండించిన వారిని పొలాల్లోనే కొనుగోలు చేయాలని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర శనివారం రిలే దీక్ష చేపట్టారు. రిలే దీక్షలో కిర్లంపూడి మండలానికి చెందిన పలువురు రైతులు తమకు న్యాయం జరిగే వరకు మద్దతుగా నిలబడతానని దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేకుండా ఇబ్బందులు పడుతున్న రైతులు నష్టాలు ఊబిలోకి కూరుకు పోయారన్నారు. పచ్చి ధాన్యం కొనుగోలు చేసేందుకే రిలే దీక్ష చేపట్టినట్టు ఆయన తెలిపారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ గీత

మహిళలపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మహిళల్లో చైతన్య వచ్చినప్పుడే చట్టాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో తెలుస్తుందని కాకినాడ ఎంపీ వంగా గీత తెలిపారు.ఆంధ్ర రాష్ట్ర మహిళాభివృద్ధి, సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు, అంతర్జాతీయ వేధింపుల నిరోధక దినోత్సవం పురస్కరించుకుని డిసెంబర్ 10 వరకు జరిగే పక్షోత్సవాల అవగాహన కార్యక్రమం శనివారం జేఎన్టీయూ సినెట్ హాల్లో ఐసిడిఎస్ పిడి ప్రవీణ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ వంగా గీత, మహిళా కమిషన్ సభ్యురాలు జయ శ్రీ రెడ్డి, రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ నెంబర్ ఆదిలక్ష్మి, కూడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాల, కళాశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మరింత చైతన్య నింపేందుకు కృషి చేస్తామని ఐసిడిఎస్ పిడి ప్రవీణ తెలిపారు.

నివాస ప్రాంతాల్లో రొయ్యల చెరువుల తవ్వకాలు

- అడ్డుకోవాలంటూ గడప గడపకూ..లో
ఎంఎల్ఏను నిలదీసిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

నివాస ప్రాంతాల్లో రొయ్యల చెరువుల తవ్వకాలు నిలుపుదల చేయించాలని సిపిఎం నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కే నాగేశ్వరరావు ఎంఎల్ఏ పెండెం దొరబాబుని నిలదీశారు గడపగడప కార్యక్రమంలో భాగంగా శనివారం పొన్నాడ శివారు ఒకటో వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పలు సమస్యలను ఎంఎల్ఏ దష్టికి తీసుకువచ్చారు సీసీ రోడ్లు విద్యుత్ స్తంభాలు వేయించాలని కోరారు. మండలంలో పంట పొలాలను రొయ్యల చెరువులుగా మారుస్తున్నారని, మరికొన్నిచోట్ల నివాస ప్రాంతాలలో అక్రమ రొయ్యల చెరువుల తవ్వుతున్నారని ఎంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చారు. జి సునీత, సుబ్బలక్ష్మి, నూకరత్నం వెంకటలక్ష్మి, అమ్మాజీ, సూర్య ప్రకాష్, జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమలతో మత్స్య సంపద కనుమరుగు

రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మత్స్య సంపద కనుమరుగవుతుందని, మత్స్యకారుల జీవనోపాధి కోల్పోతారని టిడిపి అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎంఎల్ఏ ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. మూలపేటలో శనివారం మత్స్యకారుల నాయకులు నిర్వహించిన సమావేశంలో వర్మ మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సెజ్‌కు సేకరించిన భూముల్లో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తీరప్రాంత మత్స్యకారులందరూ తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, రసాయన పరిశ్రమల నుండి వ్యర్థ నీటిని సముద్ర జలాల్లో కలిపితే మత్స్యసంపదకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కలుషిత జలాలను విడుదల చేస్తున్న పైప్ లైన్ ఎత్తివేయాలన్నారు. కెమికల్ ఫ్యాక్టరీలకు మద్దతు ఇవ్వకుండా కాలుష్య రహిత ఫ్యాక్టరీలు నియమించాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గడప గడపకు వచ్చి సెజ్ ప్రాంత ప్రజలను ఈ సమస్య నుండి కాపాడి వారి తరుపున నిలబడాలని అన్నారు. కార్యక్రమంలో అనిసెట్టి సత్యానంద రెడ్డి, వాసపల్లి ఉప్మాక, కంబాల రమణ, మలిసెట్టి అప్పారావు తదితర మత్స్యకార నాయకులూ పాల్గొన్నారు.

పట్టాభి పరిశ్రమ గేటు వద్ద అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మికులు

హక్కులను రక్షించుకుందాం

ప్రజాశక్తి - పెద్దాపురం

కార్మికులకు రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు కల్పించిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక వాలు తిమ్మాపురం రహదారిలోని పట్టాభి అగ్రపుట్స్ గేటు ముందు శనివారం అంబేద్కర్ చిత్రపటానికి, స్థానిక మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగం 8 గంటల పని విధానాన్ని, సమాన పనికి సమాన వేతనాన్ని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని, మహిళలకు ప్రసూతి సెలవులు, ప్రత్యేక హక్కులు కల్పించిందన్నారు. అదే రాజ్యాంగం ద్వారా సదుపాయాలు పొందు తున్న యాజమాన్యాలు కార్మిక హక్కులను మాత్రం కాలరాస్తు న్నాయన్నారు. అనంతరం రాజ్యాంగ పీఠిక పై ప్రమాణం చేశారు. కార్యక్రమంలో డి క్రాంతికుమార్, నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, ఆర్ వీర్రాజు, డి కష్ణ, డి సత్యనారాయణ, వడ్డి సత్య నారాయణ, కరణం అప్పారావు,గూనూరి వెంకటరమణ, కూనిరెడ్డి అప్పన్న, ఎన్.నరసింహమూర్తి,పెదబాబు, రమేష్, వరప్రసాద్, శ్రీను, బాలరాజు, జాన్, కందా శివ, తేజా, యోహాను పాల్గొన్నారు.

మొక్కలను నాటి.. సమతుల్యతను పెంచండి

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

మొక్కలు నాటి సమతుల్యాన్ని పెంచాలని కాకినాడ జిల్లా ఎస్పి ఎం.రవీంద్రనాథ్ బాబు, అడిషనల్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో శనివారం ఎస్పి కార్యాలయంలో మొక్కలను నాటారు. ఎస్పీ మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచే కార్యక్రమంలో సుమారు 300 మొక్కలను జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో నాటామన్నారు. మొక్కలు నాటి రేపటి భవిష్యత్తునకు పర్యావరణాన్ని కానుకగా అందించాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ జె ఎస్ నరసింహమూర్తి, చీఫ్‌మేనేజర్ ఆర్ఎస్ రామప్రసాద్, జిల్లా అడిషనల్ ఎస్పి బి.సత్యనారాయణ, డిఎస్‌పిలు అంబికా ప్రసాద్, మురళీకృష్ణారెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి సెల్ డి.ఎస్.పి అప్పారావు, క్రైమ్ డిఎస్‌పి రాంబాబు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి నీరుపోస్తున్న ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు

గడప గడపకూ...

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ 16వ డివిజన్ గౌరీశంకరపేట ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు వివరించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కమిషనర్ కె.రమేష్, ఆయన వెంట ఉన్నారు.

కార్టూ'నిజం'

కార్పొరేషన్ల ఆదాయం తగ్గుతోంది..!
కార్పొరేట్ల ఆదాయం పెరుగుతోంది..!!

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ఆమోదించబడిన రోజును 2105 నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్న నేపథ్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని ముఖ్య కేంద్రాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి పౌరుడు కృషి చేయాలని రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేసి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాలులో కలెక్టర్ కృతిక శుక్లా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం ఆమె జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ఆహ్వానితులతో కలిసి రాజ్యాంగ పీఠికను చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ జర్నలిస్టు పొనుగుమట్ల విష్ణుమూర్తి రచించిన - మనం-మన రాజ్యాంగం- పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. డిఆర్ఓ కె.శ్రీధరరెడ్డి పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాయంలో ఎస్పి ఎం రవీంద్రనాథ్ బాబు నివాళులర్పించారు. కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు నివాళులర్పించారు. స్థానిక ఇంద్రపాలెం వంతెన వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ అయితాబత్తుల రామేశ్వరరావు డాక్టర్ నివాళులర్పించి అనంతరం రాజ్యాంగ పీఠికను చదివి ప్రమాణం చేయించారు. డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ కోరుకొండ బాబ్జి, మోర్త రాజ శేఖర్, కమిడి శ్రీనివాస్, పి. వీరబాబు, టి రాజా, కె.శ్రీ సూర్య, జి సత్యానందం, కే వీరబాబు కాకినాడ బుద్ధ విహార్ సభ్యులు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు నివాళులర్పించారు. **కాకినాడ కార్పొరేషన్** ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం భారత రాజ్యాంగ పీఠికను డిఆర్ఓ సమక్షంలో ప్రారంభించి, కలెక్టరేట్, డిఎస్పి, ఆర్‌టిఓ, ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలలో భారత రాజ్యాంగ పీఠికను ఏర్పాటు చేశారు. ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పు దుర్గా రమేష్, జిల్లా కన్వీనర్ కె. సతీష్, కో-కన్వీనర్ దండుప్రోలు నాగబాబు పాల్గొన్నారు. పబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆధ్వర్యంలో పార్టీ జాతీయ కార్యదర్శి పిట్టా వరప్రసాద్, 99 కులాల బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కర్ గణేష్, సమాచార హక్కు ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు పప్పు దుర్గా రమేష్ నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షులు దాట్ల గాంధీ రాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. **సామర్లకోట** బ్రౌన్ పేటలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నిరసనలతో కూడిన వినతి పత్రాన్ని ఎంఎల్ నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్దాపురం నియోజక వర్గ స్థాయిలో టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హై స్కూల్లో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో దవులూ రి సుబ్బారావు ను, ఏంపిడిఓ శ్రీలలిత, ఎంఇఒ వై శివరామకష్ణయ్య నివాళులు అర్పించారు. **సామర్లకోట రూరల్** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఓ శ్రీలలిత, ఎంఇఒ వై శివరామకృష్ణయ్య, తహశీల్దార్ లక్ష్మీనరసకుమారి, సీనియర్ వైసీపీ నాయకులు దవులూరి సుబ్బారావు నివాళులర్పించారు. **జగ్గంపేట** ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో పిన్సిపాల్ ఇ. చంద్ర నాయుడు అధ్యక్షతన అవగాహన సదస్సులో వైసిపి రాష్ట్ర సేవా కార్యదర్శి డాక్టర్మి ఓమ్మి రఘురాం విద్యార్థులకు అవగాహన కల్పించారు. **ఏలేశ్వరం:** ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ ఆధ్వర్యంలో న్యాయమూర్తి కె.భాను, అసోసియేషన్ కార్యదర్శి రాజ్యాల చిట్టిబాబు కోశాధికారి ఆర్ వెంకట్రావు న్యాయవాదులు నివాళులర్పించారు. ప్రత్తిపాడు భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సత్తిరాజు, జిల్లా కార్యదర్శి నల్ల ఈశ్వరి నివాళులర్పించారు. **రౌతులపూడి** మండలంలోని ఏ.మల్లవరం బాలయోగి గురుకుల పాఠశాల, కళాశాలలో పిన్సిపాల్ ప్రసాదానం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. **పెద్దాపురం** ఏజే ఎఫ్ సి మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ స్థానిక బొమ్మల గుడి వీధి లోని సాగర్ మున్సిపల్ హైస్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో భారత రాజ్యాంగ పీఠిక పై ప్రమాణం చేయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైస్ ఎంపిపి దూళిపూడి నాగేంద్ర ప్రసాద్ నివాళులర్పించారు. అంబేద్కర్ భవనంలో ప్రజా సంఘాల నాయకులు మోకా విష్ణు ప్రసాద్, టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజుబాబు, జక్కల ప్రసాద్ బాబు, కాశీ లక్ష్మణస్వామి పాల్గొన్నారు. ఎస్16 ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మాజీ జడ్‌పి చైర్మన్ దున్న జనార్దన్ రావు కాశి రవీంద్ర, ఎలిపే నాగేశ్వరరావు పాల్గొన్నారు. తాళ్లరేవు కెవిపిఎస్ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల భవనంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు విప్పర్తి శ్రీనివాస్ అధ్యక్షతన ప్రజా సంఘాల నాయకులు టి. ఈశ్వరరావు, కాశి రవీంద్ర, వడ్డీ ఏడుకొండలు, ఎలిపే నాగేశ్వరరావు, పెయ్యల రమేష్, మురాల రాజేష్ నివాళులర్పించారు. **అన్నవరం** సత్యదేవ జూనియర్ కళాశాల, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.గంగా సూరిబాబు, జిల్లా అధ్యక్షులు జి.రాము, మండల నాయకులు బి శివరాజు అధ్యాపకులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. **కాజులూరు**లో ఎంపిపి మాత భారతి మురళి, సర్పంచులు నెల్లి బ్రహ్మాజీ గుంటూరు అప్పారావు పోతు గనిరాజు మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, ఎంపిటిసలు నివాళులు అర్పించారు. **కరప** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, ఎంపీపీ పెంకి శ్రీ లక్ష్మీ సత్తిబాబు నివాళులు అర్పించారు. **పిఠాపురం** ఆర్ ఆర్ బి హెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కేశవరావు, స్థానిక కత్తులుగూడెంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు సిద్ధు ఎపి మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ధారా వెంకటరావు నివాళులు అర్పించారు. **గండేపల్లి** ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విభాగం వారి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ జె.డి.వెంకటేష్,ఎ.సూర్య శేషగిరి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులు బి.రాంబాబు, ఐ.వి. వీరాంజనేయులు, అధ్యాపకులు, డీన్‌లు విద్యార్థులు నివాళులర్పించారు.

ప్రత్తిపాడు బార్‌అసోసియేషన్ హాలులో నివాళులర్పిస్తున్న జడ్జి భాను

రాజ్యాంగ పీఠికను చదివి అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి వాసంతి

వరకట్న నిరోధక చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పిఠాపురం

వరకట్న నిరోధక చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఏ వాసంతి అన్నారు. శనివారం పిఠాపురం జిల్లా కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో వరకట్న వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని న్యాయవాదులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జడ్జి వాసంతి మాట్లాడుతూ వివాహ సమయంలో కట్న కానుకలు తీసు కోవడం వల్లే వరకట్న వేధింపుల కేసులు పెరుగుతున్నాయన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో వరకట్న నిరోధక చట్టం గురించి వివరించాలని న్యాయ వాదులకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె మాధవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం సుధారాణి, బార్ అధ్యక్షులు మొగుడ గంగాధర్, ఏపీపీ ఎస్ నాగేశ్వరరావు, న్యాయ వాదులు బి లక్ష్మణరావు, ఏ గీత, ఎం సత్యవతి, ఎస్ కృష్ణ వీణ,ఎం శ్రీనివాసరావు, డి.రమేష్ బాబు, వై బివన్ మూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జి.వేమవరం విద్యార్థులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తాళ్లరేవు మండలం జి. వేమవరం జడ్పి హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం. జి. నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా అండర్ 14 పురుషుల విభాగంలో సుభాష్ చంద్రబోస్, ఎంపిక కాగా, బాలిక విభాగంలో అనుకులి మాధురి, అరిగెల జయ బాల త్రిపుర సుందరి ఎంపిక య్యారన్నారు. ఈ క్రీడాకారులు త్వరలో కడపలో జరగబోయే పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఎస్ ఆర్ కె వి స్వామి ని హెచ్. ఎం.అభినందించారు. కార్యక్రమంలో జి. వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, పాఠశాల కమిటీ ఛైర్మన్ అనుకూలి శ్రీనివాస్, ఎంపీటీసీ ఎర్రంరెడ్డి అప్పారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక 28వ డివిజన్‌లో నల్లవారి వీధి, బొంగరాల వారి వీధి ప్రాంతాల్లో రూ 20 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కొడా ఛైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి కుమార్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న సాగర్, అధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంఎల్ఏ ద్వారంపూడి విలేకరులతో మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇటీవల 28వ డివిజన్ సందర్శించినప్పుడు స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను ప్రాధాన్యత క్రమంలో రహదారులు, డ్రైనేజీలు నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. 28వ డివిజన్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ ప్రతిపాదన కూడా ఉందని, త్వరలో దీనిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పినిశెట్టి సతీష్, కాంట్రాక్టర్ వర్మ పాల్గొన్నారు.

గడప గడపకూ... 150 రోజులు పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

గడపగడపకు మన ప్రభుత్వం ప్రారంభించి 150 రోజులు పూర్తయిన సందర్భంగా పెద్దాపురం మండలం రాయభూపాలపట్నం గ్రామంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి గడప గడపకు మన ప్రభుత్వం కొనసాగించారు. కార్యక్రమంలో జడ్పిటిసి గవరసాన సూరిబాబు,ఎంపీపీ పెంకే సత్యవతి,గ్రామ సర్పంచ్ చీకట్ల లక్ష్మి,సొసైటీ ప్రెసిడెంట్ నల్లల నాగేంద్రబాబు, సచివాలయం సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'జడ్జి శ్రావణ్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలు సరికాదు'

న్యాయవాది మల్లిఖార్జున

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

హైకోర్టు న్యాయమూర్తుల అక్రమ బదిలీలను ప్రశ్నించినందుకు వైసిపి లీగల్ సెల్‌కి సంబంధించిన న్యాయవాదులు కొందరు జడ్జి శ్రావణ్ కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాకినాడ ప్రముఖ న్యాయవాది, జైభీమ్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కొలీజియం పేరుతో దుర్మార్గానికి పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులను, రాజకీయనాయకులను న్యాయస్థానంలో దోషులుగా నిలబెడుతున్నందుకు, ఇంటిలిజెంట్స్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ అనేక ఆరోపణలు చూపి, కొలీజియానికి కంప్లైంట్ చేసి న్యాయమూర్తి బట్టు దేవానంద్‌ను అక్రమ బదిలీ చేసిన ప్రక్రియను తీవ్రంగా ఖండించిన జడ శ్రావణ్ కుమార్‌పై వైసిపి నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు న్యాయమూర్తిగా10 సంవత్సరాలు పనిచేసిన జడ శ్రవణ్ కుమార్, ఆయన న్యాయమూర్తే కాదని, 420 గా అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, జడ శ్రవణ్ కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేశారో వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేంతవరకు న్యాయ పోరాటం చేస్తామన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు

'శ్రీ చైతన్యలో' గ్రాండ్ పేరెంట్స్ డే

ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్లో గ్రాండ్ పేరెంట్స్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి పెద్దలను గౌరవించడం నేర్చుకోవాల న్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు వంద రోజులు పూర్తి చేసుకున్నామన్నారు. ఈ వంద రోజుల్లో విద్యార్థులకు జరిగిన అకాడమిక్ ప్రోగ్రామ్స్, యాక్టివిటీస్‌ను విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియ జేశారు. పలువురు విద్యార్థులను ప్రశంసా పత్రాలతో అభినందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాము, డీన్ అరుణ్, ఇంచార్జ్ లీలా కృష్ణ ప్రైమరీ ఇన్చార్జ్ ఉమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి -ఆత్రేయపురం

మెర్లపాలెం జెడ్పి ఉన్నత పాఠశాల్లో టెన్త్ విద్యార్థి బండారు దుర్గ రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరిమళ కుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీకాంత్ శనివారం తెలిపారు శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అనపర్తిలో జరిగిన జిల్లాస్థాయి బాలికల వాలీబాల్ పోటీల్లో విద్యార్థిని దుర్గ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినిని జెడ్పిటిసి సభ్యురాలు బోనం సాయిబాబా, ఎంపిపి కుండా అన్నపూర్ణ, ఎంపిడిఒ నాతి బుజ్జి, ఎంఇఒ వరప్రసాద్ రావు, గ్రామ సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి అభినందించారు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99189

గోదారి గలగలలు

విలాపం.. విషాదం...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటన జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలువురిని కలచివేసింది. తాళ్లపూడి మండలానికి చెందిన జొన్నకూటి వినోద్ కుమారుడు దర్శిత్ (3) ప్రమాద వశాత్తూ విద్యుదాఘాతానికి గురవటంతో 12న ఆస్పత్రిలో చేర్చిన విషయం విదితమే. తీవ్ర గాయాలతో కాకినాడ జిజిహెచ్‌లో చేరిన యూడళ్ల దర్శిత్‌కు అక్కడి వైద్యులు సుదీర్ఘంగా వైద్య సేవలు అందించారు. ఒక దశలో కాళ్లు తొలగించినప్పటికీ ప్రాణం నిలవలేదు. వైద్యనిపుణులు దర్శిత్ ఆరోగ్యాన్ని పర్యవేక్షించినా ఫలితం లేకపోయింది. తొలుత రెండు మూడు రోజుల వైద్యానికి దర్శిత్ శరీరం సహకరించినా తర్వాత క్రమంలో కాలిన చర్మం కారణంగా ఇన్ఫెక్షన్ శరీర మంతా వ్యాపించడం, తీవ్రంగా రక్తం వృధా కావటంతో నాలుగు సార్లు రక్తం ఎక్కించినా ఫలితం లేకుండా పోయింది. శరీరమంతా ఇన్ఫెక్షన్ వ్యాప్తిం చెందటం, కీలకమైన గుండె, ఊపిరితతిత్తులకూ చేరటంతో పరిస్థితి విషమించింది. చివరి దశలో కృత్రిమ శ్వాసతో రవైద్యం అందించాల్సి వచ్చింది. చివరికి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. శుక్రవారం సాయంత్రం దర్శిత్ తుది శ్వాస విడిచాడు. దీంతో ఆ తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. కాళ్లు లేక పోయినా.. అమ్మా... అని పిలుస్తాడని ఆశించామంటూ ఆ తల్లి రోదనలు మిన్నంటాయి. ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యుదాఘాతంతో పలువురు మృతి చెందిన విషయం విదితమే. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి ఇటువంటి ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ధాన్యం దళారులపాలు

ప్రభుత్వ నిబంధనలు అడ్డుగోడలుగా మారటంతో ఉమ్మడి జిల్లాలో ధాన్యం దళారుల పాలవుతోంది. అల్పపీడన ప్రభావంతో అక్కడక్కడా వర్షాలు కురవటంతో రైతులు ఆందోళనతో తక్కువ ధరలకు విక్రయించినట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళారీ వ్యవస్తను అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం నూతన సాంకేతిక విధానాన్ని అమల్లోకి తెచ్చిన విషయం విధితమే. ఈ క్రాప్‌లో నమోదైన పంటల వివరాలు ఆధారంగా రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం తకొనుగోలు జరుగుతోంది. ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. తాజా విధానంతో ఒక గ్రామంలోని రైతుకు సుదూర ప్రాంతాల్లోని రైస్‌మిల్లులకు తరలించాలని చెప్పటంతో రైతులు నీరశించి పోతున్నారు. ప్రభుత్వం చెల్లించే రవాణా ఖర్చులకు అదనంగా మారటంతో ఆవేదన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం సాగు విస్తీర్ణంలో అత్యధిక మంది కౌలు రైతులే సాగు చేస్తున్న విషయం విదితమే. ఉమ్మడి జిల్లాలో కౌలు రైతుల గుర్తింపు కార్డులు సుమారు 1.50 లక్షలకు మించలేదు. దీంతో కౌలు రైతులు దళారులను ఆశ్రయించక తప్పటంలేదు. ఆరుగాలం చేసిన కష్టం తక్కువ ధరలకు విక్రయించాల్సి వస్తుందనే ఆవేదన వ్యక్తమవుతోంది.

రబీ పంటకు పుష్కలంగా నీరు

జిల్లాలో రబీ సాగుకు పుష్కలంగా నీరు అందిచేదుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలోవివరాలు వెల్లడించారు. ఈ మేరకు ఈ నెల 30 వ తేదీన ధవళేశ్వరం బ్యారేజ్ ద్వారా సాగునీటిని విడుదల చేయనున్నారు. ఈ ఆయకట్టు కింద ఉమ్మడి జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతున్న విషయం విదితమే. ప్రతి ఎకరాకూ సాగు నీరు అందిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు రైతులు విత్తనాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అయితే గత ఐఎబి సమావేశంలో ప్రతిపాదించిన అనేక అభివృద్ధి పనులు ఆచరణలో అమలుకు నోచుకోలేదు. కాల్వల ఆధునికీకరణ, గుర్రపు డెక్క తొలగింపు వంటి పనులు సైతం పూర్తి స్థాయిలో నిర్వహించలేదు. ఉదాహరణకు తొర్రిగడ్డ లిఫ్ట్ ఇరిగేషన్ కింద 1560 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఎత్తిపోతల పథకం అభివృద్ధికి రూ.22 కోట్లు మంజూరైనా ఇప్పటి వరకు 30శాతం పనులు చేపట్టలేదు. ఇరిగేషన్ అధికారులు దీని పై దష్టి సారించి ప్రతిపాదించిన పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

భారమవుతున్న సొంత ఇంటి కల

ఇంటి నిర్మాణ సామాగ్రి క్రమ క్రమంగా ధరలు పెరగటంతో సామాన్యుల సొంత ఇంటి కల భారంగా మారు తోంది. కరోనా వైరస్ ఉధృతితో గత కొంతకాలంగా నెమ్మదించిన భవన నిర్మాణ రంగం గత ఏడాదిగా సాధారణ స్థితికి చేరుకుంది. భవనాల నిర్మాణంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీలల్లో ఇంటి నిర్మాణాలు జరుగుతున్న విషయం విధితమే. గత కొన్ని రోజులుగా సిమెంటు, స్టీలు ధరలు ఒకొక్కటిగా పెరుగుతున్నాయి. దీంతో లబ్ధిదారుల ఇంటి నిర్మాణ వ్యయం ప్రణాళికలు మారిపోతున్నాయి. దీంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరల పెరుగుదలను అదుపు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉత్సాహంగా కౌశల్ సైన్స్ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్ ప్రజంటేషన్లు

జిల్లాస్థాయి కౌశల్ ప్రతిభా పోటీలు శనివారం స్థానిక సాలిపేట బాలికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. భారతీయ విజ్ఞాన మండలి, ఎపి రాష్ట్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ అంశాల్లో విద్యార్థులు పోటీపడ్డారు. క్విజ్ 108 మంది విద్యార్థులు,పోస్టర్ ప్రజెంటేషన్ 72 మంది విద్యార్థులు,108 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారు డిసెంబర్ 9న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కాకినాడ జిల్లా కౌశల్ సమన్వయకర్త ఎస్ వెంకటేశ్వరావు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జోన్ 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ డి. మధుసూదన్ రావు మాట్లాడారు. డిఇఒ డి సుభద్ర, కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి అర్ జే డానియల్ రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎం శ్రీనివాస్ సునీల్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లాల సమన్వయ కర్త కేసరి శ్రీనివాస్ రావు, ఇస్రో మాజీ శాస్త్రవేత్త యాళ్ళ శివప్రసాద్, హెచ్ఎం జె.సుబ్బలక్ష్మి, కాకినాడ జిల్లా కౌశల్ సమన్వయకర్త ఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పిఆర్ కళాశాల విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక పిఠాపురం రాజా అటానమస్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి సహకారంతో కళాశాల మహిళా సాధికారత విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, హెల్త్ క్లబ్ సంయుక్తంగా ప్రిన్సిపల్ డా. బి.వి. తిరుపాణ్యం అధ్యక్షతన విద్యార్థులకు రక్త పరీక్షలను నిర్వహించారు. సుమారు 480 మందికి రక్త గ్రూపులను, హీమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించి, రక్త హీనత ఉన్న వారిని గుర్తించి వైద్య సహాయాన్ని, మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతిప్రభ మాట్లాడుతూ రక్త హీనత లక్షణాలను, నివారణ చర్యలను, రక్త హీనతకు లోనుకాకుండా విద్యార్థి దశ నుండి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల మహిళా సాధికారత విభాగము కన్వీనర్ జి. శ్రీదేవి, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక అధికారి డాక్టర్ పి.వి. శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు దస్తావేజుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

వాలు తిమ్మాపురం రహదారిలోని టిడ్కోఇళ్ల సముదాయంలో ప్లాట్లు పొంది బ్యాంకు రుణ సదుపాయాలు పూర్తయిన లబ్ధిదారులకు శనివారం స్థానిక 14 వ సచివాలయంలో మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి వీర వెంకట దుర్గ అధ్యక్షతన జరిగిన సభలో 25వ వార్డుకు సంబంధించిన లబ్ధిదారులకు వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ దస్తావేజులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరిబాబు, బొడ్డు ప్రకాష్, చింతా శ్రీనివాసరావు రఫీ, వాసంశెట్టి గంగ పాల్గొన్నారు.

ఉల్లాసంగా రెండో రోజు యోగా పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో సీబీఎస్ఈ సౌత్ జోన్ యోగా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం చీఫ్ జడ్జి రాపర్తి శ్రీను మాట్లాడుతూ అండర్ -14 బాలికల విభాగంలో 20 బందాలు పాల్గొనగా వీరిలో 12 బందాలు ఫైనల్స్‌కు చేరుకున్నాయన్నారు. అండర్- 14 బాలుర విభాగంలో 8 బందాలు పాల్గొనగా వీరిలో తమిళనాడులోని కుందర్భూర్‌కు చెందిన పీస్ ఆన్ గ్రీన్ ఎర్త్ పబ్లిక్ స్కూలు ప్రథమ స్థానం సాధించగా తమిళనాడులోని హిల్ స్కూల్ ద్వితీయ స్థానం, పాండిచ్చేరిలోని ఆదిత్య విద్యాశ్రమం తతీయ స్థానం సాధించాయన్నారు. అండర్- 17 విభాగంలో బాలురు, బాలికలకు రెండవ రోజు పోటీలు కొనసాగాయన్నారు. కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ స్కూల్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నల్లరాతి క్వారీలలో కొనసాగుతున్న అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని తిరుపతమ్మ పేట. ఎస్ పైడిపాల. ఉప్పంపాలం తదితర రెవిన్యూలో తవ్వకాలు చేపడుతున్న నల్ల రాతి క్వారీలను శనివారం ఏజి శ్రీనివాస్. రాయల్ టీ ఇన్స్పెక్టర్ జ్యోతిర్మయి తదితర సిబ్బంది ఆధ్వర్యంలో మూడవరోజు తనిఖీలు నిర్వహించారు ఈ తనిఖీలలో క్వారీలకు ఉన్న అనుమతులు, తవ్వకాలు చేపట్టిన విస్తీర్ణం వంటి పలు అంశాలను పరిశీలించామని ఏజి శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. అయితే తనిఖీ చేసే సమయంలో కొన్ని క్వారీలు వద్ద తవ్వకాలు జరగడం లేదని అధికారులు తెలుపుతున్నప్పటికీ అధికారులు తూతూ మంత్రంగా పరిశీలన చేపడుతున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారుల బృందం

తాటిపాకలో హౌసింగ్ డే

ప్రజాశక్తి-రాజోలు

పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా తాటిపాక లేఔట్లల్లో శనివారం మండల ప్రత్యేక అధికారి, డిఎల్‌డిఒ విజయ థామస్, మండల టీంతో హౌసింగ్ డే నిర్వహించారు. ఆయన లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని కోరారు. ఇందులో స్థానికంగా జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. అక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఎంపిడిఒ కుమార్, ఎఇ హౌసింగ్ సత్యనారాయణ, ఎఇ పిఆర్. కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయునికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి -కాట్రేనికోన

మాతృ వియోగంతో బాధపడుతున్న సీనియర్ పాత్రికేయులు తాడి శ్రీనివాస్ ను పలువురు ప్రముఖులు పరామర్శించారు. శ్రీనివాస్ మాతృమూర్తి కృష్ణవేణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ముమ్మిడివరం మాజీ ఎంఎల్ఎ దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, కాట్రేనికోన మండల టిడిపి అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు తదితరులున్నారు.

వీరమ్మ కుటుంబసభ్యులకు..

అంబాజీపేట గంగలకుర్రుకు చెందిన శతాధిక వృద్ధురాలు వంగా వీరమ్మ (102) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వంగా వీరమ్మ కుమారులు రంగారావు, శ్రీనివాసరావు, మదన గోపాలరావులను మండలానికి చెందిన పాత్రికేయులు శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పళ్ల సూర్య ప్రకాశరావు, మాలే వెంకట దుర్గా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

బియ్యం లారీని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసులు

18 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-నల్లజర్ల

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంత పల్లి టోల్ ప్లాజా వద్ద శనివారం 18 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐషర్ వ్యాన్ లో విజయవాడ నుంచి కాకినాడకు అక్రమంగా తరలిస్తున్న 18 టన్నుల రేషన్ బియ్యం లారీ అనంతపల్లి టోల్ ప్లాజా వద్దకు రాగానే పోలీసులకు అనుమానం కలిగింది. దీంతో వారు తనిఖీ చేయగా బియ్యం లారీగా నిర్ధారణ అయింది. లారీని వెంటనే రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు. సివిల్ సప్లై అధికారులు బియ్యాన్ని పరిశీలించి వాటిని రేషన్ బియ్యంగా నిర్ధారించారు. అనంతరం ముగ్గురిపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని గోపాలపురం తరలించి నట్లు ఎఎస్ఐ సుజాత తెలిపారు.

కాలువలోకి దూసుకుపోయిన ఇటుక ట్రాక్టర్

ప్రజాశక్తి అమలాపురం

కాలువలోకి ఒరిగిపోయిన ట్రాక్టర్

అమలాపురం నల్లవంతెన ఎర్రవంతెన మధ్య ఉన్న కాటన్ రోడ్డులో శనివారం ఇటుక ట్రాక్టర్ కాలువలోకి దూసుకెళ్లింది. రోడ్డు పక్కనే కాలువ ఒడ్డున మత్స్య కారులు చేపలు అమ్ముకునే ప్రదేశంలో నల్ల వంతెన మీద నుంచి వచ్చిన ఇటుక ట్రాక్టర్ బ్రేక్ ఫెయిల్ కావడంతో మత్స్య కారులు ఉండే ప్రదేశం వైపు దూసుకు వచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టిన వారు ఒక్కసారిగా పక్కకు తప్పుకున్నారు. దీంతో కాలువలోకి ట్రాక్టర్ దూసుకు పోయింది. ఈ ఘటనలోవెంకాయమ్మ అనే మహిళరే స్వల్ప గాయాలయ్యాయి.

విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం గ్రామానికి చెందిన కవల దొరాజీ అనే రైతుకు చెందిన గేదెకు శనివారం విద్యుత్ తీగలు తగిలి మృతిచెందింది. రఘుదేవపురంలో ఎన్టీఆర్ విగ్రహం వెనుక రైతు భరోసా కేంద్రంవద్ద విద్యుత్ తీగలు కిందకి వ్రేలాడుతున్న తీగలు తగిలి గేదె మృతి చెందింది.గేదెను కోల్పోయి నష్టపోయిన రైతుకు అధికారులు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

పిఠాపురం ఎస్ఐగా జగన్మోహన్

ప్రజాశక్తి - పిఠాపురం

: పట్టణ ఎస్ఐ గా బి జగన్మోహన్ రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ టూ టౌన్ లా అండ్ ఆర్డర్ ఎస్ఐ గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై పట్టణ ఎస్ఐగా వచ్చారు. పలువురు స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు విధులు నిర్వహించి కాకినాడ టూ టౌన్ లా అండ్ ఆర్డర్ స్టేషన్‌కు బదిలీ అయిన బి శంకర్ రావును సిబ్బంది శాలువాతో సత్కరించారు.

బిజెపి విధానాలను తిప్పి కొట్టాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపి విధానాలను తిప్పికొట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గౌరవ అధ్యక్షులు తోకల వరదరాజ సాంక్షి అన్నారు. తాళ్లరేవులో ఎండి యూడబ్ల్యూఏ నాయకులు రెడ్డి గిరిబాబు స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం జిల్లాలో యాత్ర చేసి జిల్లా కలెక్టర్‌కు రాజ్యాంగ వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కరపత్రాన్ని వీరు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కాగిత శ్రీనివాస్, జి.విజయ్ కుమార్, నల్లి శ్రీనివాసరావు, పినిపే రంగారావు, నీతిపూడి దయానంద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బాలికపై అత్యాచారం కేసులో 31 సంవత్సరాల జైలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

వావివరసలు మరిచి కూతురు వరస అయ్యే బాలికపై అత్యాచారం చేసిన మండలంలోని లింగం పర్తి శివారు ములకలమెట్టకు చెందిన వ్యక్తికి కాకినాడ ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ 31 సంవత్సరాలు జైలు శిక్ష విధించినట్లు పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళీ మోహన్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ గత ఆగస్టు 21వ తేదీన ములకల మెట్టకు చెందిన చలంశెట్టి బుజ్జి తనకు కూతురు వరసయ్యే 14 ఏళ్ల బాలికను మాయమాటలు చెప్పి ప్రత్తిపాడు మేరీమాత కొండ వెనుక జన సంచారం లేని క్వారీ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడన్నారు. ప్రత్తిపాడు సిఐ కె.కిషోర్ బాబు, ఏలేశ్వరం ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ దిశా చట్టం కింద ఏడు రోజుల్లో సార్జ్ సీటు దాఖలు చేశారని తెలిపారు. కేసును త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి జిల్లా ఎస్పీ రివార్డులు ఇవ్వనున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో సిఐ కిషోర్ బాబు ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ ఉన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం మండలం కామవరపుకోట నుంచి కరిచర్లగూడెం వస్తుండగా కరిచర్లగూడెం శివారులో శనివారం ఆటోని వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిసుతన్న ఎనిమిది మంది వ్యవసాయ కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL -CUM- ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.O.P. 29/2022

Between:
Senapathi Krishnaveni and others ....Petitioners
And
Sunkari Samuel and others .....Respondents
R-2: V.Satyanarayana,S/o Bullimasenu
Owner of the Van Bearing
No. AP 1 U 5174,
Resident of Door No. 1-72,
Ramalayam Street,
Kadiam, E.G. District.

NOTICE

Please take notice that the above O.P., stands posted to **29-12-2022** for notice to the 2nd respondent. You should appear in person or through an advocate at **10-30 AM** on the above said date in the above court.

If you not appear on the said date the above matter will be decided exparte.

(P.A.N. Raju)
Advocate for the petitioner,
Vizianagaram

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు : పిఠాపురం
O.S. No. 34/2022

Between:
యాళ్ళ బాపన్నదొర ...వాది
మరియు
యాళ్ళ కామేశ్వరరావు వగైరాలు...ప్రతివాదులు
ప్రతివాదులు :
D_3 : యాళ్ళ చక్రధరరావు, S/o. (లేటు) వీర్రాజు డో.నెం. 2-153/బి, మంగితుర్తి గ్రామం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.
D_4 : యాళ్ళ దొరబాబు, S/o. (లేటు) వీర్రాజు డో.నెం. 2-153/బి, మంగితుర్తి గ్రామం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా

పై నెంబరు దావాలో 3 మరియు 4 ప్రతివాదులు అయిన మీకు శ్రీకోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపుచున్న తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకముగా కాలయాపన చేయుచున్నారు. కావున పై దావాలో D_3, D_4లు అయిన మీరు ఇరువురు **ది. 13-12-2022** తేదీన పై కోర్టునందు **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేయవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

|| By Court Order ||

కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S. 2/2021

Between:
శ్రీమతి కొవ్వూరి లక్ష్మీకాంతం, వగయిరా **-వాద్లు**
AND
నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ, రి.బై ప్రెసిడెంట్ మరియు సెక్రటరీ మరియు కరస్పాండెంట్ వేగేశ్న సరస్వతి మరియు వగయిరా **-ప్రతివాద్లు**

To: ప్రతివాద్లు:
5) సాగి భీమరాజు, S/o. సూర్యనారాయణ రాజు, 62 సం॥, హిందు, పు॥, డో.నెం. 2-253, శంకరాపురం, H/o. రావిమెట్ల, నిడదవోలు మండలం, NDD JCJC.
6) సాగి సూర్యకాంతం, W/o. భీమరాజు, హిందూ, స్త్రీ, 54 సం॥లు, డో.నెం. 2-253, శంకరాపురం, H/o. రావిమెట్ల, నిడదవోలు మండలం.
7) కట్టా గంగాధరరావు, S/o. సూర్యనారాయణ రాజు, హిందు, పు॥, 70 సం॥లు, డో.నెం. 2-253, శంకరాపురం, H/o. రావిమెట్ల, నిడదవోలు మండలం, NDD JCJC.

యీ నెంబరు దావాలో మీకు ఎన్నిమార్లు కోర్టు ద్వారానూ, రిజిష్టరు పోస్టు ద్వారానూ సమన్లు పంపించిననూ మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనకుండా Avoid చేయుచున్నందున శ్రీ కోర్టు వారి వుత్తర్వులు ప్రకారం ది. **20-12-2022వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది వారి ద్వారా గాని హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకోగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

గర్రే శ్రీనివాసరావు, న్యాయవాది
కొవ్వూరు, తూ॥గో॥జిల్లా
కొవ్వూరు సెల్: 991221555
20-11-22 8500411555

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.782/2022, O.S.No.43/2022

బిట్వీన్:
మెరికెల సుబ్బారాయుడు, తండ్రి: గనిరాజు, వయస్సు 42 సం॥లు, హిందూ, వ్యవసాయం, అల్లవరం, అల్లవరం మండలం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.
...పిటీషనరు /వాది
అండ్
పెన్మెత్స వంశీ కృష్ణరాజు, తండ్రి: లేటు రామకృష్ణరాజు, వయస్సు 24 సం॥లు, హిందూ, మెడికల్ స్టూడెంట్, డోర్ నెం.5-3-75, సుబ్బారాయుడి గుడి వద్ద, కాలేజీరోడ్, అమలాపురం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
...రెస్పాండెంటు /ప్రతివాది

పై నెంబరులో పిటీషనర్ /వాది మీపై దాఖలు చేసిన దావా మొత్తము, తదుపరి వడ్డీ మరియు ఖర్చులకు మిమ్మలను సెక్యూరిటీ ఇమ్మని, లేనిచో పిటీషన్ షెడ్యూల్ దాఖలాస్థిని జప్తు చేయించుమని కోరుచూ పిటీషన్‌ను దాఖలు చేసినందున, అందుపై శ్రీ కోర్టువారు మీకు ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసిననూ అమలు జరగనందున మీకు ఏమైనా ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని ఉన్న ఎడల శ్రీ కోర్టువారి ఎదుట వాయిదా తేదీ అయిన **ది.30-11-2022వ సం॥రం తేదీన ఉదయం 10:30ల గం॥లకు స్వయముగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై తెలియపర్చుకొనవలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

తిక్కా వెంకట ప్రసాదరావు
పిటీషనరు తరపున అడ్వకేట్,
అమలాపురం, అమలాపురం.
24-11-22. సెల్: 94400 63075

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.43/2022

బిట్వీన్:
మెరికెల సుబ్బారాయుడు, తండ్రి: గనిరాజు, వయస్సు 42 సం॥లు, హిందూ, వ్యవసాయం, అల్లవరం, అల్లవరం మండలం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.
...వాది
అండ్
పెన్మెత్స వంశీ కృష్ణరాజు, తండ్రి: లేటు రామకృష్ణరాజు, వయస్సు 24 సం॥లు, హిందూ, మెడికల్ స్టూడెంట్, డోర్ నెం.5-3-75, సుబ్బారాయుడి గుడి వద్ద, కాలేజీరోడ్, అమలాపురం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
...ప్రతివాది

పై నెంబరులో వాది పేరున మీ తండ్రి పెన్మెత్స రామకృష్ణరాజు, తల్లి పెన్మెత్స లక్ష్మిదేవి @ లక్ష్మిలు జాయింటుగా వ్రాయించి ఇచ్చిన ప్రాంశరీ నోటు బాకీ మొత్తమునకు వారు మరణించినందున, వారి వారసులైన మీపై డిక్రీ ఇప్పించమని కోరుచూ వాది దావా దాఖలు చేసినారు. అందుపై శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు సమన్లు జారీ చేసిననూ అమలు జరగనందున మీకు ఏమైనా ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని ఉన్న ఎడల శ్రీ కోర్టువారి ఎదుట వాయిదా తేదీ అయిన **ది.30-11-2022వ సం॥రం తేదీన ఉదయం 10:30ల గం॥లకు స్వయముగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై తెలియపర్చుకొనవలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

తిక్కా వెంకట ప్రసాదరావు
వాది తరపున అడ్వకేట్,
అమలాపురం, అమలాపురం.
24-11-22. సెల్: 94400 63075